సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
బుధవారం ׀ 6 ׀ సెప్టెంబర్ ׀ 2023



'సీఎస్సార్' పక్కదారి !

పలు కర్మాగారాలు ఉన్న పాల్వంచ అభివృద్ధికి వెచ్చించాల్సిన సీఎస్సార్ నిధులు పక్కదారి పడుతున్నాయి. 8లో



ఉపాధ్యాయ వృత్తి ఉన్నతమైంది

విద్యార్థులను అన్ని రంగాల్లో తీర్చిదిద్దే ఉపాధ్యాయ వృత్తి మహోన్నతమైనదని ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్ అన్నారు. 8లో

గరిష్టం / కనిష్టం
28° / 25°

వాతావరణం

జిల్లాలో బుధవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలు చోట్ల ఓ మోస్తరు వర్షం పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

'డయల్ యువర్ ఎస్పీ' కి 17 మంది ఫిర్యాదు



ప్రజల సమస్యలు వింటున్న ఎస్పీ వినీత్

కొత్తగూడెంటౌన్: ఎస్పీ డాక్టర్ వినీత్ మంగళవారం నిర్వహించిన డయల్ యువర్ ఎస్పీ కార్యక్రమానికి జిల్లా వ్యాప్తంగా 17 మంది బాధితులు ఫోన్ చేసి తమ సమస్యలను తెలియజేశారు. ఇందులో భూతగాదా కేసులు నాలుగు, వ్యక్తిగత విషయాలు తొమ్మిది, సాధారణ సమస్యలు మూడు, చీటింగ్ కేసుకు సంబంధించిన ఒక సమస్యను ప్రజలు తమ దృష్టికి తెచ్చారని ఎస్పీ వినీత్ వివరించారు. ఆయా సమస్యల పరిష్కారం కోసం సంబంధిత పోలీస్‌స్టేషన్ల అధికారులకు ఆదేశాలు జారీ చేశామని తెలిపారు. ఫోన్ ద్వారా సమస్యను చెప్పలేని వారెవరైనా ఉంటే నేరుగా సంప్రదించవచ్చని సూచించారు.

డీఈఓగా వెంకటేశ్వరా చారి



ఎం.వెంకటేశ్వరా చారి

కొత్తగూడెంఅర్బన్: జిల్లా విద్యాశాఖ అధికారిగా ఎం.వెంకటేశ్వరా చారిని నియమిస్తూ స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఆయన ఖమ్మం జిల్లా విద్యాశాఖలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా పని చేస్తున్నారు. గతంలో రెండు జిల్లాలకు డీఈఓగా ఉన్న సోమశేఖర శర్మ ఇకపై ఖమ్మం జిల్లా డీఈఓగా మాత్రమే విధులు నిర్వర్తించనున్నారు. ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల సమయం కావడంతో వెంకటేశ్వరాచారిని నియమించారు.

బదిలీలకు 2,954 మంది దరఖాస్తు

కొత్తగూడెంఅర్బన్: ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులకు సంబంధించి ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రక్రియ మంగళవారం ముగిసింది. జిల్లాలో బదిలీల కోసం 2,954 మంది ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకున్నారని జిల్లా విద్యాశాఖాధికారులు తెలిపారు. ఆన్‌లైన్ దరఖాస్తు కాపీలను ఉపాధ్యాయులు ఎంఈఓలకు అప్పగించిన అనంతరం 8వ తేదీ నుంచి పరిశీలన ప్రక్రియ ప్రారంభం అవుతుందని వివరించారు. దీంతో పాటు పదోన్నతుల జాబితా కూడా ప్రకటిస్తామని పేర్కొన్నారు.

మరో మూడు రోజుల పాటు వర్షాలు

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లాలో మరో మూడు రోజుల పాటు ఉరుములు, మెరుపులతో కూడిన వానలు పడే అవకాశం ఉందని కేవీకే ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డాక్టర్ వి. లక్ష్మీనారాయణమ్మ, జిల్లా వ్యవసాయ వాతావరణ విభాగం పర్యవేక్షకులు ఎం. సుమన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు పంటలకు ఎరువులు, పురుగుమందులు వేయొద్దని సూచించారు. ఎవరూ చెట్ల కింద ఉండొద్దని, పశువులను కూడా ఉంచొద్దని తెలిపారు.

మందుల షాపుల్లో అధికారుల తనిఖీ



పాల్వంచలోని ఓ షాపులో తనిఖీ చేస్తున్న అధికారులు

పాల్వంచ : పాల్వంచ, కొత్తగూడెం పట్టణాల్లోని మందుల దుకాణాలను ఔషధ నియంత్రణ శాఖ అధికారులు మంగళవారం తనిఖీ చేశారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ జి.ప్రసాద్, ఖమ్మం, భద్రాద్రి జిల్లాల డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు దేవేందర్ రెడ్డి, సంపత్ కుమార్ ఆధ్వర్యంలో సుమారు 10 షాపుల్లో రికార్డులు, మందులను పరిశీలించారు. ప్రిస్కిప్షన్ లేకుండా మందులు విక్రయిస్తున్నారా అనే వివరాలు ఆరా తీశారు. అనంతరం అసిస్టెంట్ డైరెక్టర్ ప్రసాద్ మాట్లాడుతూ వైద్యుల ప్రిస్కిప్షన్ లేకుండా మందులు అమ్మవద్దని, రిజిస్టర్ నిర్వహణ సక్రమంగా ఉండాలని సూచించారు. ఏదైనా అవకతవకలకు పాల్పడినట్లు తెలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తనిఖీ చేసిన అన్ని షాపుల్లో లోపాలను గుర్తించి షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు డీఐ సంపత్ కుమార్ తెలిపారు.

నివాసాల పేరుతో.. నిధులు వృథా!

సింగరేణి కొత్తగూడెం ఏరియాలో రూ. 273 కోట్లతో నిర్మాణం

- ఇప్పటికే అవసరానికి మించి 558 క్వార్టర్లు
- నిబంధనలు బేఖాతర్ చేస్తున్న అధికారులు
- కొందరి ప్రయోజనాల కోసమేనంటూ ఆరోపణలు



సింగరేణి కొత్తగూడెం ఏరియా గౌతమ్‌పూర్‌కాలనీలో కొనసాగుతున్న క్వార్టర్ల నిర్మాణ పనులు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: సింగరేణి వ్యాప్తంగా ఇప్పటికే 12 వేల క్వార్టర్లు అధికంగా ఉండగా, కొత్తగా మళ్లీ వందల సంఖ్యలో క్వార్టర్లు నిర్మించడాన్ని కార్మికులు తప్పుపడుతున్నారు. మిగులు క్వార్టర్లను సద్వినియోగం చేయడం ఎలా అనే అంశంపై దృష్టి సారించకుండా, ఎవరి స్వలాభం కోసం సంస్థ నిధులను భవన నిర్మాణాల పేరిట దుర్వినియోగం చేస్తున్నారని ప్రశ్నిస్తున్నారు.

రూ. 273 కోట్లతో నిర్మాణాలు..

సింగరేణి సంస్థ ప్రధాన కార్యాలయం ఉన్న కొత్తగూడెంలో రూ.273 కోట్ల వ్యయంతో కొత్తగా 643 క్వార్టర్లు నిర్మిస్తున్నారు. ఇప్పటికే అవసరానికి మించి క్వార్టర్లు ఉన్నా.. త్వరలో ప్రారంభం కాబోయే వెంకటేశ్ఖని -7 (వీకే-7) ఓపెన్ కాస్ట్‌ను సాకుగా చూపుతూ కొత్తవి నిర్మిస్తుండడం గమనార్హం. ఈ ఏడాది చివరి నాటికి వీకే ఓపెన్ కాస్టులో బొగ్గు ఉత్పత్తి చేపడతామని సంస్థ చెబుతోంది. దీంతో ఇందులో పని చేసే కార్మికుల సౌకర్యం కోసం కొత్తగా క్వార్టర్లు నిర్మించాల్సిన అవసరం ఉందంటూ ప్రతిపాదనలు సిద్ధం చేయడమే కాక ఆగమేఘాల మీద అనుమతులు ఇచ్చి టెండర్లు పిలిచి పనులు ప్రారంభించారు.

ఉత్పత్తి మొదలు కాకుండానే

సింగరేణి సంస్థ నియమ, నిబంధనల ప్రకారం ఏదైనా కొత్త గని ప్రారంభించినప్పుడు యంత్ర సామగ్రి, భూసేకరణ, పర్యావరణ అనుమతులు, కార్మికుల సౌకర్యాలు ఇలా అన్నింటికీ కలిపి బడ్జెట్ కేటాయిస్తుంది. సింగరేణి సంస్థ విస్తరించి ఉన్న ఆరు జిల్లాల పరిధిలో చాలా వరకు స్థలాలు సింగరేణి లీజులోనే ఉన్నాయి. అక్కడక్కడా రెవెన్యూ, అటవీ భూములు సేకరించాల్సి వస్తోంది. యంత్రాలు ఇప్పటికే సంస్థ వద్ద ఉన్నాయి. ఇక కార్మికుల సౌకర్యాల విషయానికి వస్తే గని ప్రారంభమైన తర్వాత మూడేళ్ల పాటు ఉత్పత్తి జరిగి, ఆ పని ప్రదేశంలో బొగ్గు వెలికి తీయడం లాభసాటిగా ఉందని నిర్ధారణ అయిన తర్వాతే కార్మికుల నివాసాల కోసం క్వార్టర్లు నిర్మించాలని నిబంధనలు చెబుతున్నాయి.

అనుమానాలు ఎందుకంటే..

సింగరేణి సంస్థ చేపట్టే భవన నిర్మాణాలకు సంబంధించి సివిల్ పనుల్లో భారీ ఎత్తున అవినీతి జరుగుతోందనే ఆరోపణలు ఉన్నాయి. కొందరు అధికారులు తమ చేతులు తడిపితే చాలు అన్నట్టుగా వ్యవహరించారని, ఇంకొందరు ఇప్పటికీ అలాగే వ్యవహరిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. ఇందుకు తాజా ఉదాహరణ కొత్తగూడెం ఏరియా పరిధిలోని గౌతమ్‌పూర్ క్వార్టర్ల అంశం. ఇక్కడ 20 ఏళ్ల క్రితం టీ2 టైప్ క్వార్టర్లు అపార్ట్‌మెంట్ తరహాలో వందల సంఖ్యలో నిర్మించారు. ఆరంభంలో వీటి వైభవం చూసి ఈ ఏరియాను బొంబాయి కాలనీగా పిలిచేవారు. కానీ ఇది మూణ్నాళ్ల ముచ్చటే అయ్యింది. ఐదారేళ్లకే పెచ్చులు ఊడి పడడంతో పాటు గోడలకు పగుళ్లు వచ్చాయి. ఇరవై ఏళ్లు తిరిగే సరికి ఇందులో సగానికి పైగా క్వార్టర్లు శిథిలావస్థకు చేరుకున్నాయి. దీంతో ప్రమాదభరితంగా మారిన క్వార్టర్లను సంస్థ ఇటీవల కూల్చేస్తోంది. వాస్తవానికి సిమెంట్, ఐరన్, కాంక్రీట్‌తో చేపట్టిన నిర్మాణాల జీవిత కాలం 99 ఏళ్లు. కానీ సింగరేణి సంస్థ నిర్మించిన క్వార్టర్లు ఇరవై ఏళ్లకే పనికి రాకుండా పోయాయి. నాణ్యత విషయంలో రాజీ పడడం వల్లే ఈ దుస్థితి వచ్చిందని కార్మికులు అంటున్నారు.

ఎవరి మేలు కోసం?

సింగరేణి సంస్థ ప్రస్తుతం కొత్తగూడెం ఏరియాలో రూ.272 కోట్ల వ్యయంతో 643 క్వార్టర్లు నిర్మిస్తోంది. ఇందులో సత్తుపల్లిలో 81 మినహాయిస్తే 558 నివాసాలు కొత్తగూడెంలోనే ఏర్పాటు చేస్తున్నారు. రుద్రంపూర్‌లో 270, త్రీ ఇంక్లైన్ బంగ్లోస్ ఏరియాలో 83, కొత్తగూడెం కార్పొరేట్ ఏరియా బంగ్లోస్ (ఇల్లెందు గెస్ట్ హౌస్)లో 14, రైటర్ బస్తీలో 195 క్వార్టర్లు నిర్మిస్తున్నారు. నిబంధనలు పక్కన పెట్టి హడావిడిగా వీటికి డిజైన్లు ఖరారు చేయడం, టెండర్లు పిలవడం వెనుక కార్మికుల ప్రయోజనం కంటే కొందరు అధికారుల స్వలాభానికే పెద్దపీట వేశారనే ఆరోపణలు వస్తున్నాయి. మరోవైపు అధికారుల్లో ఒకరిద్దరు తమకు అనుకూలంగా ఉండే కంపెనీకే నిర్మాణ పనుల టెండర్ దక్కేలా చక్రం తిప్పారనే చర్చ కార్పొరేట్ కార్యాలయంలో గుప్పుమంటోంది. అందుకే టెండర్ల ప్రక్రియలో కేవలం రెండు కంపెనీలే పాల్గొంటే అందులో ఒకటి నామ్ కే వాస్తేగా దరఖాస్తు వేసిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

చేయూతనిస్తారా.. చేయిస్తారా?

- కాంగ్రెస్ ఆశావహుల్లో టెన్షన్.. టెన్షన్
- కొనసాగుతున్న దరఖాస్తుల వడపోత
- మధిరకు భట్టి.. భద్రాచలానికి పొదెం ఓకే
- జనరల్ స్థానాల్లో పోటీ చేసే అభ్యర్థులపై ఉత్కంఠ
- గాంధీభవన్ చుట్టూ ఆశావహుల ప్రదక్షిణలు



సాక్షిప్రతినిధి, ఖమ్మం: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున పోటీ చేసే అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ ప్రారంభంతో ఉమ్మడి జిల్లాలోని ఆశావహుల్లో టెన్షన్ మొదలైంది. అభ్యర్థుల దరఖాస్తులను పరిశీలించిన ప్రదేశ్ ఎన్నికల కమిటీ(పీఈసీ) ఉమ్మడి జిల్లాలో మధిర నుంచి సీఎల్పీ నేత మల్లు భట్టివిక్రమార్క, భద్రాచలం నుంచి పొదెం వీరయ్య అభ్యర్థిత్వాలను ఖరారు చేసింది. మిగిలిన ఎనిమిది నియోజకవర్గాల్లోని కొన్నింటిలో బహుముఖ పోటీ నెలకొనగా... దరఖాస్తుల పరిశీలన అనంతరం పీఈసీ జాబితాను స్క్రీనింగ్ కమిటీకి అందజేసింది. కాగా, బుధవారం గాంధీభవన్‌లో పరిశీలించి అధిష్టానానికి తుది జాబితా అందజేసే అవకాశముంది. ఈ నేపథ్యాన స్క్రీనింగ్ కమిటీకి వెళ్లిన జాబితాలో తమ పేరు ఉందా, లేదా అనే ఆందోళన ఆశావహుల్లో నెలకొనగా.. పలువురు హైదరాబాద్‌లో మకాం వేసి తమ ప్రయత్నాలను ముమ్మరం చేశారు.

దరఖాస్తులు ఇచ్చి ప్రదక్షిణలు చేస్తూ..

ఉమ్మడి జిల్లాలోని పది నియోజకవర్గాలకు కాంగ్రెస్ తరఫున పోటీ చేసేందుకు టీపీసీసీకి 120 మంది దరఖాస్తు చేసుకున్నారు. అత్యధికంగా ఇల్లెందు నుంచి 32 మంది దరఖాస్తు చేయడం గమనార్హం. ఇక పినపాక నుంచి 17, వైరా 15, పాలేరు 14, సత్తుపల్లి, కొత్తగూడెం నుంచి పది మంది చొప్పున, ఖమ్మం నుంచి తొమ్మిది, అశ్వారావుపేట నుంచి ఎనిమిది, భద్రాచలం నుంచి ముగ్గురు, మధిర నుంచి ఇద్దరు దరఖాస్తు చేశారు. అన్నింటినీ పరిశీలించిన పీఈసీ ఇద్దరు నుంచి ముగ్గురు అభ్యర్థుల జాబితాను స్క్రీనింగ్ కమిటీకి ఇవ్వగా, ఆ కమిటీ పరిశీలించి అధిష్టానానికి పంపించనుంది.

మధిర, భద్రాచలం ఓకే..

మధిర, భద్రాచలం నియోజకవర్గాలకు అతి తక్కువ దరఖాస్తులు వచ్చాయి. మధిర నుంచి సీఎల్పీ నేత భట్టి, కోట రాంబాబు దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క బలమైన అభ్యర్థి అయినందున కమిటీలో అభ్యంతరం ఎదురుకాకపోవడంతో ఆయన పేరు ఖరారు చేశారని సమాచారం. ఇక భద్రాచలం నుంచి ముగ్గురు దరఖాస్తు చేయగా సిట్టింగ్ ఎమ్మెల్యే, భద్రాద్రి డీసీసీ అధ్యక్షుడైన పొదెం వీరయ్య వైపే కమిటీ మొగ్గు చూపింది.

జనరల్ స్థానాలపై ఆసక్తి

ప్రధానంగా జనరల్ స్థానాల్లో ఎవరికి టికెట్ వస్తుందనే అంశంపై రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. కాంగ్రెస్ ప్రచార కమిటీ కోచైర్మన్ పొంగులేటి శ్రీనివాసరెడ్డి.. పాలేరు, ఖమ్మం, కొత్తగూడెం స్థానాలకు దరఖాస్తు చేసుకున్నారు. ఇంతలోనే మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కాంగ్రెస్‌లో చేరడం ఖరారు కావడంతో ఆయన ప్రధానంగా పాలేరు టికెట్ ఆశిస్తున్నట్లు తెలిసింది. ఈ నేపథ్యాన పొంగులేటిని అధిష్టానం ఎక్కడి నుంచి బరి లోకి దింపుతుందనే చర్చ జరుగుతోంది. మూడు జనరల్ స్థానాల్లో బహుముఖ పోటీ నెలకొనడంతో ఎవరికి అవకాశం దక్కుతుందనే ఉత్కంఠ నెలకొంది.

ఇక్కడా పోటాపోటీ

రిజర్వ్ స్థానమైన ఇల్లెందు నుంచి ఎక్కువ మంది దరఖాస్తు చేశారు. అయితే పీఈసీ స్థాయిలోనే వడబోత అనంతరం ఇద్దరు నుంచి ముగ్గురినే పరిగణనలోకి తీసుకున్నట్లు తెలిసింది. సత్తుపల్లి, వైరా, పినపాక, అశ్వారావుపేట స్థానాలోనూ పోటీకి ఆశావహులు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇక్కడా ఇద్దరు నుంచి నలుగురి పేర్లతో కూడిన జాబితాను పీఈసీ స్క్రీనింగ్ కమిటీకి పంపించింది.

రాజధానికి ఉరుకులు

స్క్రీనింగ్ కమిటీకి వెళ్లిన జాబితాలో తమ పేరు ఉంటుందని భావిస్తున్న ఆశావహులు టికెట్ కోసం రాజధాని బాట పట్టారు. సీఎల్పీ నేత భట్టి, కాంగ్రెస్ ప్రచార కమిటీ కో చైర్మన్ పొంగులేటి, కేంద్ర మాజీ మంత్రి రేణుకాచౌదరి అనుచరులు భారీగా దరఖాస్తు చేసుకోగా, కొందరి పేర్లను పీఈసీ ఎంపిక చేసి.. స్క్రీనింగ్ కమిటీకి పంపించింది. దీంతో ఆశావహులు గాంధీభవన్‌కు క్యూ కట్టారు. తమ నేతల ద్వారా సిఫారసు చేయించుకుని టికెట్ దక్కించుకునేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. స్క్రీనింగ్ కమిటీ బుధవారం అభ్యర్థుల వడపోత కార్యక్రమం నిర్వహించనుండగా.. అక్కడే మకాం వేసిన ఆశావహులు తమ వంతు ప్రయత్నాల్లో నిమగ్నమయ్యారు.

కొనసాగుతున్న శ్రీమద్భాగవత సప్తాహం

రామాలయంలో రేపు శ్రీ కృష్ణాష్టమి వేడుకలు



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



భాగవత పారాయణం చేస్తున్న స్థానాచార్యులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో శ్రీ మద్భాగవత సప్తాహ హవనం కొనసాగుతోంది. చిత్రకూట మండపంలో ఏర్పాటు చేసిన హోమం వద్ద అర్చకులు, పండితులు అగ్నిప్రతిష్ఠ, వేదవిన్నపం చేశారు. అనంతరం గోపూజ, సప్తాహ పారాయణం ప్రారంభించి భాగవతంలోని 1వ స్కంధం నుంచి 3వ స్కంధంలో 20వ అధ్యాయం వరకు పారాయణం చేశారు. ఈ సప్తాహం 30వ తేదీ వరకు జరగనుంది. ఇక గురువారం శ్రీకృష్ణాష్టమి వేడుకలను వైభవంగా నిర్వహించనున్నారు. ప్రత్యేకంగా అలంకరించిన స్వామివారికి బేడా మండపంలో ఊంజల్ సేవ, పుష్పాంజలి, ప్రత్యేక కార్యక్రమాలు గావిస్తారు.

స్వామివారికి శాస్త్రోక్తంగా నిత్యకల్యాణం

శ్రీ సీతారామచంద్రస్వామి వారి నిత్యకల్యాణ వేడుకను మంగళవారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం జరిపారు. స్వామివారికి కంకణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కాగా, మంగళవారాన్ని పురస్కరించుకుని అభయాంజనేయ స్వామివారికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. ఇక రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పర్యటన సందర్భంగా ఏర్పాటుచేసిన ప్రారంభోత్సవ శిలాఫలకాన్ని టూరిజం అధికారులు గతంలో తొలగించగా, ఆలయ ఈఓ రమాదేవి విన్నపం మేరకు మంగళవారం తిరిగి అందజేశారు.

పరస్పర సమన్వయంతోనే మావోయిస్టుల కట్టడి

మూడు రాష్ట్రాల పోలీస్, సీఆర్‌పీఎఫ్ అధికారుల సమావేశంలో నిర్ణయం



సమావేశంలో మాట్లాడుతున్న భద్రాచలం ఏఎస్పీ పరితోష్ పంకజ్

భద్రాచలంటౌన్: పరస్పర సహకారం, సమన్వయంతోనే మావోయిస్టులను కట్టడి చేసే అవకాశం ఉంటుందని తెలంగాణ, ఏపీ, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల పోలీసు అధికారులు అభిప్రాయం వ్యక్తం చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం ఏఎస్పీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశానికి పోలీస్, సీఆర్పీఎఫ్ అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా భద్రాచలం ఏఎస్పీ పరితోష్ పంకజ్ మాట్లాడుతూ.. అంతర్ రాష్ట్ర సరిహద్దుల్లో మావోయిస్టుల కదలికలపై నిఘా పెడితే వారి చర్యలను కట్టడి చేయవచ్చన్నారు. ఈ మూడు రాష్ట్రాల్లో ఇప్పటికే మావోయిస్టుల సంచారం తగ్గిందని, ఇంకా నియంత్రించాల్సిన అవసరం ఉందని అన్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల సమయంలో తీసుకోవాల్సిన ముందుజాగ్రత్త చర్యలపై చర్చించారు. ఈ సమావేశంలో ఏటూరు నాగారం ఏఎస్పీ సంకీర్త్, మణుగూరు డీఎస్పీ రాఘవేంద్రరావు, ఛత్తీస్‌గఢ్ డీఎస్పీలు శంకర్రావు, మడివి శేఖర్, సీఆర్‌పీఎఫ్ కమాండెంట్ అయోధ్య సిన్హా, ప్రీతి, అజయ్ ప్రతాప్ సింగ్, పీయూష్ తివారీ, పామేడు, మారాయిగూడెం, ఊసూరు, ఎలిమిడి సీఐలు ప్రదీప్, రాజేంద్ర దివాన్, వినోద్ ఎక్కా, ప్రధాన్, గజేంద్ర కుమార్, నాగరాజు రెడ్డి, రాజగోపాల్ పలువురు ఎస్సైలు పాల్గొన్నారు.

గిరిజనులకు ఇంటి నంబర్లు కేటాయించాలి



మాట్లాడుతున్న కోరం కనకయ్య, పక్కన ఎమ్మెల్సీ తాతా మధు, కలెక్టర్ ప్రియాంక ఆల

- జెడ్పీ సర్వసభ్య సమావేశంలో చైర్మన్ కోరం కనకయ్య
- ప్రజాసమస్యలపై సత్వరం స్పందించాలన్న ఎమ్మెల్సీ తాతా మధు

చుంచుపల్లి: గిరిజనులకు ఇంటి నంబర్ల కేటాయింపునకు చర్యలు చేపట్టాలని జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య అన్నారు. జెడ్పీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తాగునీటి సరఫరాను గ్రామ పంచాయతీల ద్వారా పర్యవేక్షణ చేస్తున్నామని, నిర్వహణ బాధ్యతలు ఏజెన్సీలకు అప్పగించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. మిషన్ భగీరథ ఇంజనీరింగ్ అధికారుల సమన్వయ లోపంతో నీటి సరఫరాలో ఇబ్బందులు వస్తున్నాయని సభ్యులు తెలపగా, సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని చెప్పారు. అందరికీ పోడు పట్టాలు రాలేదని పలువురు సభ్యులు సమావేశం దృష్టికి తీసుకురాగా, తగు చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ మాట్లాడుతూ సర్వసభ్య సమావేశంలో చర్చించిన అంశాలపై లోతుగా విశ్లేషణ చేసి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని, తమ వరకు వస్తే చర్యలు తప్పవని అధికారులను హెచ్చరించారు. తీసుకున్న చర్యలపై సభ్యులకు నివేదిక ప్రతులను అందజేయాలన్నారు. ప్రజా ప్రతినిధులు ప్రజలతో మమేకం అవుతారని, గ్రామస్థాయిలో సమస్యలు వారికే తెలుస్తాయని అన్నారు. ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న పోడు రైతులకు పట్టాలు ఇచ్చామని, వారికి రైతుబంధు నిధులు కూడా మంజూరు చేస్తున్నామని వివరించారు. గృహలక్ష్మి, బీసీ, మైనార్టీ, దళిత బంధు పథకాలను అర్హులందరికీ విడతల వారీగా అందిస్తామని తెలిపారు. వైద్య రంగంలో పురోగతి సాధించామన్నారు. అనంతరం కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల మాట్లాడుతూ.. పోడు భూముల పట్టాలకు వచ్చిన దరఖాస్తులను విచారణ చేస్తామని చెప్పారు. సర్వే జరిగి, పట్టాలు రాని వివరాలను జిల్లాస్థాయి కమిటీలో ఆమోదించారా, తిరస్కరించారా అన్న అంశాలను పరిశీలన చేస్తామని తెలిపారు. ఉపాధిహామీ పథకం పనులకు రానివారికి కూడా నిధులు చెల్లిస్తున్నారని కొందరు సభ్యులు చెప్పగా లిఖితపూర్వకంగా అందజేస్తే విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆళ్లపల్లిలోని కస్తూర్బా పాఠశాలకు ప్రహరీ మంజూరు చేయాలని కోరగా చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ దిండిగల రాజేందర్, జెడ్పీ వైస్ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావు, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ రాజు, జెడ్పీ సీఈఓ విద్యాలత తదితరులు పాల్గొన్నారు.

పంటలకు ఊపిరి

- మరో మూడు రోజుల పాటు వర్షం సమాచారంతో రైతుల్లో ఆనందం
- నెల రోజుల తరువాత జిల్లాలో కురిసిన వాన
- జిల్లా సరాసరి 8.3 మి.మీ.గా నమోదు
- ఆరు మండలాల్లో కురవని వర్షం



లక్ష్మీదేవిపల్లి మండలంలో సాగు చేస్తున్న మొక్కజొన్న

సూపర్‌బజార్(కొత్తగూడెం): నెలరోజుల పాటు ముఖం చాటేసిన వరుణుడు మంగళవారం కనికరించడంతో వానాకాలం పంటలకు ఊపిరి పోసినట్టయింది. అల్పపీడన ప్రభావంతో మరో మూడు రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉందనే సమాచారంతో రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. జిల్లాలో నీటి వనరులున్న ప్రాంతాల్లో కొంత మెరుగైన పరిస్థితి ఉన్నప్పటికీ వర్షాలపై ఆధారపడిన రైతులకు మాత్రం అనావృష్టి గుండెల్లో గుబులు పుట్టించింది. పత్తిచేలు వడలిపోతుండడంతో రైతులు ఆందోళన చెందారు. కాగా, మంగళవారం కురిసిన వర్షంతో వారు ఊపిరి పీల్చుకున్నారు. ఇప్పటికైనా వర్షాలు తగినంత పడకపోతే పెట్టుబడులు కూడా తిరిగి వచ్చే పరిస్థితి లేదని వాపోతున్నారు.

ఆరు మండలాల్లో మినహా..

జిల్లా వ్యాప్తంగా సరాసరి వర్షపాతం 8.3 మి.మీ.గా నమోదైంది. కరకగూడెం, ఆళ్లపల్లి, గుండాల, టేకులపల్లి, దమ్మపేట, అశ్వారావుపేట మండలాల్లో మినహా మిగిలిన ప్రాంతాల్లో ఓ మోస్తరు వర్షం కురిసినట్లు అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. పాల్వంచలో అత్యధికంగా 25 మి.మీ., చర్ల మండలంలో 22.6 మి.మీ. వర్షపాతం నమోదైంది. ఇక పినపాక మండలంలో 13.2, దుమ్ముగూడెంలో 10.2, అశ్వాపురంలో 2.4, మణుగూరులో 7.6, ఇల్లెందులో 9.4, జూలూరుపాడులో 6.2, చంద్రుగొండలో 16.2, అన్నపురెడ్డిపల్లిలో 5.4, చుంచుపల్లిలో 14.2, సుజాతనగర్‌లో 12.6, కొత్తగూడెంలో 17, లక్ష్మీదేవిపల్లిలో 16, బూర్గంపాడులో 2.6, భద్రాచలంలో 2.4, ములకలపల్లి మండలంలో 7.8 మి.మీ. వర్షపాతం నమోదైంది.

జూలైలోనే అధికం..

వర్షాకాలం ప్రారంభమైన జూన్‌లో 164.4 మి.మీ. వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా 80.3 మి.మీ. వర్షం పడి 51.2 మి.మీ. లోటు వర్షపాతం నమోదైంది. జూలైలో 302.5 మి.మీ. సాధారణ వర్షపాతానికి గాను 615 మి.మీ. వర్షం కురిసి 104.2 శాతం అధికంగా నమోదైంది. ఆగస్టులో 198 మి.మీ. వర్షం పడాల్సి ఉండగా ఒకరోజు మాత్రమే వర్షం పడడంతో 89.8 శాతం లోటు వర్షపాతం నమోదైంది. సెప్టెంబర్‌లో మంగళవారం 8.3 మి.మీ. వర్షం కురిసింది.


వర్షాలు పడకుంటే కోలుకోలేం



వానాకాలం ప్రారంభం నుంచి వర్షాలు తీవ్ర ఇబ్బందులు పెడుతున్నాయి. ఇంకో నెల మాత్రమే కాలం ఉంది. ఇప్పటికైనా సక్రమంగా వర్షాలు పడకపోతే కోలుకోలేని నష్టం వాటిల్లుతుంది.

– కోబల్, రైతు, లక్ష్మీదేవిపల్లి మండలం

వర్షాలు తక్కువే కురిశాయి



ఈసారి జిల్లాలో వర్షాలు తక్కువగా కురవడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రైతులు అప్రమత్తంగా ఉండాలి. వర్షాలు మూడురోజులు కురిసే అవకాశం ఉన్నందున అధికారుల సూచన మేరకు పంటలకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలి.

– కొర్సా అభిమన్యుడు, జిల్లా వ్యవసాయాధికారి

క్లుప్తంగా

సేవలు అభినందనీయం



నరసింహారావును సన్మానిస్తున్న కలెక్టర్

సూపర్‌బజార్(కొత్తగూడెం): 1987 అక్టోబర్‌లో రెవెన్యూ శాఖలో కాపలాదారునిగా చేరిన గోడె నరసింహారావు 36 సంవత్సరాలపాటు విధి నిర్వహణలో చేసిన సేవలు అమూల్యమైనవని కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల కొనియాడారు. అంకితభావంతో అందరి మన్ననలు పొందారని అన్నారు. ఉద్యోగ విరమణ చేసిన నరసింహారావును మంగళవారం కలెక్టరేట్‌లో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాంబాబు, ఏఓ గన్యా, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు అజ్మీరా రామ్‌రవి, కన్యావతి, తాజుద్దీన్, మస్తాన్, వై.నరసింహారావు, గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు అవార్డులు ఇవ్వరా?

టేకులపల్లి: గత రెండేళ్లుగా జిల్లా ఉపాధ్యాయులకు ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా అవార్డులు ప్రకటించడం లేదని, ఈ పరిస్థితి ఎందుకు ఎదురవుతుందో అధికారులు చెప్పాలని టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుగులోత్ హరిలాల్‌నాయక్ పేర్కొన్నారు. విద్యార్థులను ఉపాధ్యాయులు అన్ని రకాలుగా తీర్చిదిద్దుతున్నప్పటికీ రెగ్యులర్ డీఈఓ లేకపోవడంతో అవార్డులకు నోచుకోవడం లేదని తెలిపారు. అన్ని జిల్లాల్లో ఉపాధ్యాయులకు అవార్డులు ఇస్తున్నా, రెండేళ్లుగా భద్రాద్రి జిల్లాలో మాత్రం నిరాశే ఎదురవుతోందని వాపోయారు. కనీసం అధికారికంగా ఉపాధ్యాయ దినోత్సవం కూడా నిర్వహించడం లేదని ఆయన పేర్కొన్నారు.

బీసీ డిక్లరేషన్ కమిటీ సభ్యుడిగా సీతారాములు



సీతారాములు

కొత్తగూడెంఅర్బన్ : బీసీ డిక్లరేషన్ కమిటీ సభ్యుడిగా టీపీసీసీ సభ్యులు నాగా సీతారాములు నియమితులయ్యారు. బీసీ డిక్లరేషన్‌పై పొన్నం ప్రభాకర్ నేతృత్వంలో టీపీసీసీ ఓ కమిటీ వేయగా సభ్యుడిగా సీతారాములుకు చోటు దక్కింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ద్వారానే బీసీలకు న్యాయం జరుగుతుందన్నారు. కమిటీలో ఆరుగురు కో చైర్మన్లు, 9 మంది సలహాదారులు, ఒక ప్రోగ్రాం కన్వీనర్‌తో పాటు 37 మంది బీసీ నాయకులకు చోటు కల్పించారు. కాగా, సీతరాములుకు కమిటీలో స్థానం దక్కడం పట్ల కొత్తగూడెం నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

జూలూరుపాడు: మండలంలోని జడలచింత గ్రామ సమీపంలో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. పాపకొల్లు గ్రామ పంచాయతీ భీమ్లాతండాకు చెందిన భూక్యా వీరన్న బైక్‌పై పాల్వంచలో జరిగిన ఓ శుభకార్యానికి వెళ్లి తిరిగివస్తున్నాడు. జడలచింత గ్రామ సమీపంలో గల తుమ్మలవాగు లోలెవల్ బ్రిడ్జి వద్దకు రాగానే అడ్డుగా వచ్చిన పశువులను ఢీకొట్టాడు. దీంతో వీరన్న వాగులో పడిపోగా కంటిపై భాగంలో గాయమైంది. క్షతగాత్రుడిని కుటుంబ సభ్యులు కొత్తగూడెంలోని ఓ ఆస్పత్రికి తరలించారు.

విషపు గుళికలు తిని వివాహిత ఆత్మహత్య

దమ్మపేట: కుటుంబ కలహాల కారణంగా వ్యవసాయంలో వినియోగించే విషపు గుళికలు తిని వివాహిత ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన మండలంలోని రంగువారిగూడెం గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన వనమా పోలమ్మ (51)కు భర్త శేషయ్యతో మనస్పర్థలు వచ్చాయి. క్షణికావేశానికి లోనైన పోలమ్మ మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో విషపు గుళికలు తిన్నది. గమనించిన కుటుంబ సభ్యులు దమ్మపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందింది. మృతురాలి తల్లి కూరం చిట్టెమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ రవికుమార్ తెలిపారు.

లాడ్జి యజమానిపై దాడి

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని ఓ లాడ్జి యజమానిపై కొందరు వ్యక్తులు దాడి చేసిన ఘటనపై పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. విస్తా కాంప్లెక్స్ వద్ద రామభద్రా రెస్సిడెన్సీ యజమాని బొర్రా నాగసందీప్‌పై కొందరు యువకులు సూపర్‌బజార్ సెంటర్‌లో దాడి చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

సైబర్ కేసు నమోదు

భద్రాచలంటౌన్: సైబర్ మోసంపై పట్టణ పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పట్టణానికి చెందిన ముక్కా తరుణ్ గత నెల 25న తన మొబైల్ చూస్తుండగా రూ.50 లోన్ ఇస్తామని ఓ యాప్ కనిపించడంతో దానిపై క్లిక్ చేశాడు. అనంతరం దాని ద్వారా వచ్చిన మెసేజ్‌లకు ఆయన స్పందించి సుమారు రూ.24 వేలు చెల్లించాడు. సొమ్ము చెల్లించిన అనంతరం మోసపోయినట్లు గుర్తించి బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

‘సీఎస్సార్’ పక్కదారి!

- కేటీపీఎస్ ఏడో దశ నిధుల వ్యయం అరకొరే
- ప్రభావిత ప్రాంతాల్లో కాకుండా ఇతర చోట్ల వెచ్చించిన వైనం
- దత్తత గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనపై దృష్టిపెట్టని అధికారులు



ఏళ్లుగా అధ్వానంగా ఉన్న కేటీపీఎస్ కర్మాగారం రోడ్డు

పాల్వంచ : పారిశ్రామికంగా పలు కర్మాగారాలు ఉన్న పాల్వంచలో అభివృద్ధి ఆశించిన స్థాయిలో జరగడం లేదు. కర్మాగారాల నుంచి వెచ్చించాల్సిన సీఎస్సార్(కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్‌బిలిటీ) నిధులు సక్రమంగా విడుదల కాకపోగా, వచ్చిన నిధులను సైతం అధికారులు సక్రమంగా ఖర్చు చేయడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వాటిని ఇతర ప్రాంతాల్లో వెచ్చిస్తూ ఇక్కడి అభివృద్ధిని విస్మరిస్తున్నారు. కర్మాగారం నుంచి వెలువడే ప్రాణాంతక కాలుష్యంతో అనేక అనారోగ్య సమస్యలతో కొట్టుమిట్టాడుతున్న పట్టణ, సమీప గ్రామాల ప్రజలు, కర్మాగారాలు దత్తత తీసుకున్న గ్రామాల వారు కనీస మౌలిక వసతులు లేక ఇబ్బంది పడుతున్నారు. సీఎస్సార్ నిధులతో అభివృద్ధి చేయాలని స్థానికులు ఆందోళన చేస్తుండగా వారిపై కేసులు పెడుతూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. ఇదిలా ఉండగా పరిశ్రమల చట్టం ప్రకారం ఆయా సంస్థల వార్షిక ఆదాయాన్ని ప్రతి ఏటా ప్రకటించి, అందులో 2 శాతం సీఎస్సార్ కింద అభివృద్ధి, సంక్షేమ చర్యలకు ఖర్చు చేయాల్సి ఉండగా.. అసలు వార్షిక ఫలితాలే ప్రకటించడం లేదని, ఆన్‌లైన్‌లోనూ నమోదు చేయడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కాగా, జెన్‌కో సంస్థలో ఉన్న థర్మల్ ప్లాంట్‌లు నష్టాల్లోనే ఉండడంతో వాటి నుంచి సీఎస్సార్ నిధులు కొన్నేళ్లుగా విడుదల కావడం లేదు.

దత్తత గ్రామాలపై పట్టింపు కరువు

కేటీపీఎస్ ప్రభావిత పాల్వంచ పట్టణంతో పాటు, సురారం, పాండురంగాపురం, సోములగూడెం పంచాయతీలు, 23 ప్రభావిత గ్రామాలను దత్తత తీసుకుని అక్కడ అభివృద్ధి, సంక్షేమంపై పలు కార్యక్రమాలు నిర్వహించాల్సి ఉంది. చెట్లు పెంచడం, ఆరోగ్య శిబిరాలు, స్వచ్ఛమైన తాగునీటి సదుపాయం, పాఠశాలలు, గ్రంథాలయాలు, రోడ్లు, డ్రైనేజీల నిర్మాణాలు, ఇతర అవసరమైన సదుపాయాలు, చేతి వృత్తులు, ఉపాధి అవకాశాలు పెంపొందించడం వంటి కార్యక్రమాలు చేపట్టాల్సి ఉండగా అధికారులు ఆ దిశగా కృషి చేయడం లేదనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఇక అల్లూరి సెంటర్ నుంచి కేటీపీఎస్ 5, 6 దశల కర్మాగారాల వరకు రోడ్డు అధ్వానంగా తయారైంది. ఈ రోడ్డును విస్తరించి, సీసీ వేయాలని, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనలు వంటి పలు ప్రధాన సమస్యలు పరిష్కారం కావడం లేదు.

నిధులు అరకొరగానే వస్తున్నాయి



సీఎస్సార్ నిధులు అరకొరగానే విడుదలవుతున్నాయి. 2019లో కేటీపీఎస్ ఏడో దశ నిర్మాణం సందర్భంగా విడుదల చేసిన నిధులు సైతం సగమే ఖర్చు చేశారు. ఏటా లాభాల్లో 2 శాతం విడుదల కావాల్సి ఉండగా అవి కూడా ప్రకటించడం లేదు. దీంతో నిధులు ఎలా వస్తున్నాయి, ఎక్కడ ఖర్చు చేస్తున్నారనే లెక్కలే లేవు.

– రమేశ్ రాథోడ్, గ్రీన్ ఎర్త్ సొసైటీ వ్యవస్థాపకులు

ఏడో దశ నిర్మాణం నిధులేవి?

720 మెగావాట్ల సామర్థ్యం గల కేటీపీఎస్ ఓఅండ్‌ఎం కర్మాగారానికి కాలం చెల్లడంతో మూసేసి, దీని స్థానంలో సూపర్ క్రిటికల్ టెక్నాలజీతో 800 మెగావాట్ల సామర్థ్యం గల ఏడో దశ ప్లాంట్ నిర్మించారు. ఇందుకోసం సీఎస్సార్ కింద రూ.21 కోట్లు ఖర్చు చేసేలా జెన్‌కో యాజమాన్యం ఒప్పందం చేసుకుంది. అలాగే ఓఅండ్‌ఎం కర్మాగారం (పాత ప్లాంట్) నిధులు రూ.3.50 కోట్లు వెచ్చించారు. ఈ నిధులు కర్మాగారం పూర్తయ్యే నాటికి (2019 వరకు) ఖర్చు చేయాల్సి ఉంది. కానీ ఐదేళ్లు గడుస్తున్నా అవి కూడా ఖర్చు చేయలేదు. నిధుల ఖర్చుకు చైర్మన్‌గా ఉన్న కలెక్టర్ చొరవ తీసుకోవాల్సి ఉంటుంది. అయితే ఇందులో కొన్ని కొత్తగూడెం, లక్ష్మీదేవిపల్లి, మహబూబాబాద్ వంటి పట్టణాల్లో ఖర్చు చేసినట్లు తెలుస్తోంది. ఇక్కడి కాలుష్య ప్రభావిత నిధులను ఇతర ప్రాంతాల్లో వెచ్చించడం ఏంటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

సీఎస్సార్ నిధులు ఇవ్వడం లేదు



కేటీపీఎస్ 5, 6, 7 దశల కర్మాగారం నిర్మాణ సమయంలో మాత్రమే సీఎస్సార్ నిధులు వచ్చాయి. ప్రస్తుతం థర్మల్ ప్లాంట్‌లకు లాభాలు రావడం లేదు. నష్టాల్లో ఉండడం వల్ల సీఎస్సార్ నిధులు వచ్చే పరిస్థితి లేదు. కేవలం ఏడో దశ, బీటీపీఎస్ నుంచి కొన్ని నిధులు రావాల్సి ఉంది.

– ఎం.ప్రభాకర్ రావు, సీఈ, కేటీపీఎస్ 5,6 దశలు

మృతిచెందిన కానిస్టేబుల్ కుటుంబానికి చెక్కు



చెక్కు అందిస్తున్న ఎస్పీ వినీత్

కొత్తగూడెంటౌన్: కొత్తగూడెం టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తూ గత నెలలో గుండెపోటుతో మరణించిన హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులకు రూ.8 లక్షల చెక్కును ఎస్పీ డాక్టర్ వినీత్ అందజేశారు. మంగళవారం ఎస్పీని ఆయన చాంబర్‌లో వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులు కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీ చెక్కు అందించి మాట్లాడారు. పోలీస్ అధికారులు, సిబ్బంది ఆరోగ్యం విషయంలో జాగ్రత్తలు పాటించాలని కోరారు. కార్యక్రమంలో జయరాజు, సత్యవతి, శ్రీనివాసరావు, యాకోబు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత

కొత్తగూడెంటౌన్: కొత్తగూడెం వన్‌టౌన్ పరిధిలో మొబైల్ పోగొట్టుకున్న నల్లమోతు బాలకృష్ణకు మంగళవారం సీఐ కరుణాకర్ తిరిగి ఆ మొబైల్‌ను అందజేశారు. బస్టాండ్ సెంటర్‌లో ఆగస్టు 10వ తేదీన బాలకృష్ణ మొబైల్ పోగొట్టుకున్నాడు. అదేరోజు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు సీఈఐఆర్ ద్వారా ఆపరేటర్ సురేశ్‌తో విచారణ చేయించి మొబైల్‌ను కనిపెట్టారు. ఈ సందర్భంగా బాలకృష్ణ సీఐ కరుణాకర్‌కు కృతజ్ఞతలు తెలిపాడు.



బాలకృష్ణకు ఫోన్ అందిస్తున్న సీఐ

ఆందోళనకరంగా చిన్నారి ఆరోగ్యం



చికిత్స పొందుతున్న లావణ్యశ్రీ

దుమ్ముగూడెం: ఆర్‌ఎంపీ చేసిన వైద్యానికి చిన్నారి ఆరోగ్యం ఆందోళనకర స్థితికి చేరింది. మండలంలోని కొత్తమారేడు గ్రామానికి చెందిన బుద్దుల లావణ్యశ్రీకి జ్వరం రాగా, నరసాపురం గ్రామంలోని ఆర్‌ఎంపీ చేసిన చికిత్స వికటించిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం చిన్నారి భద్రాచలం ఏరియా వైద్యశాలోని ఐసీయూలో చికిత్స పొందుతోంది. చిన్నారి ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగా ఉందని ఆర్‌ఎంఓ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు.

వేతన బకాయిలు ఒకేసారి చెల్లించాలి

టేకులపల్లి: సింగరేణి కార్మికులకు 11వ వేతన ఒప్పందం బకాయిలు ఒకేసారి చెల్లించాలని ఏఐటీయూసీ అనుబంధ సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి కె.సారయ్య, బ్రాంచ్ కార్యదర్శి ఎండీ నజీర్ అహ్మద్ డిమాండ్ చేశారు. మండలంలోని కేటీసీలో మంగళవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. మూడు నెలలుగా కొత్త వేతనాలు అందుతున్నప్పటికీ, నిధుల కొరత పేరిట బకాయిల చెల్లింపులో అలస్యం చేయడం సరికాదన్నారు. ఈ విషయంలో టీబీజీకేఎస్ నాయకులు విఫలమయ్యారని ఆరోపించారు. బుధవారం అన్ని జీఎం కార్యాలయాల ఎదుట ఆందోళనలు చేపట్టనున్నట్లు తెలిపారు. సమావేశంలో నాయకులు కొంగర వెంకటేశ్వర్లు, గడదాసు నాగేశ్వరరావు, గుగులోత్ కృష్ణ, గుగులోత్ రాంచందర్, షేక్ సర్వర్, ఎల్లబోయిన రంజిత్, శ్రీనివాస్, సామల శ్రీనివాస్, రామకృష్ణాచారి, ఇబ్రహీం, షబ్బీర్, వెంకటనర్సయ్య, వెంగళ రవి, ఐలయ్య, రాందాస్, మైకెల్, ఇస్మాయిల్, కనకరాజు, ప్రభుదాస్, ఖాదర్, ఐతా శ్రీరాములు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సారయ్య

ఒకే విడతలో చెల్లించాలి..

మణుగూరురూరల్: సింగరేణి కార్మికులకు 11వ వేజ్‌బోర్డ్ ఒప్పందానికి సంబంధించి ఏరియర్స్ బకాయిలను ఒకే విడతలో చెల్లించాలని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్ యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మణుగూరు ఏరియాలోని ఓసీ–2, కేసీహెచ్‌పీ, ఏరియా వర్క్‌షాప్‌లో జరిగిన పిట్ మీటింగులలో, స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. 11వ వేజ్‌బోర్డ్ ఏరియర్స్‌ను కోలిండియా కార్మికులకు చెల్లిస్తుండగా సింగరేణిలో మాత్రం ఆ ఊసే లేదని, బకాయిలను ఒకేసారి చెల్లించాలని డిమాండ్ చేశారు. దమ్మాలపాటి శేషయ్య, వై.రాంగోపాల్, ఎంవీ రాంనర్సయ్య, మేకల ఈశ్వర్, ఆవుల నాగరాజు, సుభాని, కె.శ్రీనివాసరావు, రవికుమార్, శ్రీనివాసరావు, జి.గంగాధర్‌రావు, అలీ, షకీల్, శ్రీను, వెంకటేశ్వర్లు, సత్యనారాయణ, ప్రతాప్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అట్రాసిటీ కేసు నమోదు

దమ్మపేట: మహిళను అసభ్య పదజాలంతో దూషిస్తూ, ఆమెపై దాడికి పాల్పడిన వ్యక్తులపై పోలీసులు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని వడ్లగూడెం గ్రామానికి చెందిన బూసి లక్ష్మి (30)కి అదే గ్రామానికి చెందిన వ్యక్తులతో కొంతకాలంగా భూవివాదాలు ఉన్నాయి. గత ఆగస్టు 12వ తేదీన వడ్లగూడెం గ్రామంలో పల్లె శ్రీను, పల్లె నాగులు, తాత రామకృష్ణ, కోరు అనిల్, కొండమురుగు నాగలక్ష్మి, యాస సరోజిని, వల్లమాలిన చిట్టెమ్మ కలిసి బూసి లక్ష్మిని అసభ్య పదజాలంతో దూషించడమే కాక ఆమెపై దాడి చేశారు. శారీరకంగా చిత్రహింసలు పెట్టి మెడలోని 32 గ్రాముల బంగారు గొలుసు, మొబైల్‌ను లాక్కొనిపోయారు. బాధిత మహిళ ఫిర్యాదు మేరకు అట్రాసిటీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ రవికుమార్ తెలిపారు.

బైండోవర్ ఉల్లంఘించిన మహిళకు రూ.లక్ష జరిమానా



వైరా/తల్లాడ: నాటుసారా తయారుచేస్తూ పట్టుబడిన మహిళను బైండోవర్ చేయగా, మళ్లీ నాటుసారా తయారీకి పాల్పడడంతో రూ.లక్ష జరిమానా విధించారు. తల్లాడ మండలం నారయ్య బంజరకు చెందిన బానోత్ పార్వతి నెల క్రితం నాటుసారా విక్రయిస్తూ పట్టుబడింది. దీంతో ఆమెను తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. కానీ మళ్లీ నాటుసారా తయారు చేయడంతో బైండోవర్‌ను ధిక్కరించినట్లుగా భావించి తల్లాడ తహసీల్దార్ వి.రవికుమార్ ఎదుట మంగళవారం హాజరుపర్చగా రూ.లక్ష జరిమానా విధించడంతో ఆమె చెల్లించిందని వైరా ఎక్సైజ్ ఎస్‌ఐ మమత తెలిపారు.

పురుగులమందు తాగి యువకుడి ఆత్మహత్య



రాకేశ్ మృతదేహం

బూర్గంపాడు: సారపాక – రెడ్డిపాలెం మూలమలుపు వద్ద ఓ యువకుడు పురుగులమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రాష్ట్రీయ రహదారి వెంబడి ఓ యువకుడు అపస్మారక స్థితిలో పడి ఉండటాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారమిచ్చారు. అక్కడకు చేరుకున్న పోలీసులు ఆ యువకుడు మృతిచెందాడని గుర్తించారు. మృతుడు వేలేరు గ్రామానికి చెందిన మాచినేని రాకేశ్ (22) అని తెలిసింది. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం బూర్గంపాడు ఆస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి



సాంబశివరావు మృతదేహం

అశ్వారావుపేట: గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. అశ్వారావుపేట కలింగులబజార్‌కు చెందిన చల్లా సాంబశివరావు (68) మంగళవారం తెల్లవారుజామున వాకింగ్‌కు వెళ్లాడు. నారవారిగూడెం వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్ట్‌మార్టం కోసం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుమార్తె దుర్గ ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ శ్రీకాంత్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, ముగ్గురు కుమార్తెలున్నారు.

చికిత్స పొందుతున్న వివాహిత...

గుండాల: కొంతకాలంగా కడుపునొప్పి వస్తుండటంతో పురుగులమందు తాగిన ఓ వివాహిత చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన మండలంలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని జగ్గాయిగూడెం గ్రామానికి చెందిన పాంబోయిన స్రవంతి (21) కొంత కాలంగా కడుపునొప్పి వస్తుండడంతో భరించలేక పదిహేను రోజుల కిందట పురుగులమందు తాగింది. ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున మృతి చెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జ్వరంతో వ్యక్తి...



సోమయ్య (ఫైల్)

గుండాల: వారం రోజులుగా తీవ్ర జ్వరంతో బాధపడుతూ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రైతు మంగళవారం మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. మండలంలోని లింగగూడెం గ్రామానికి చెందిన కల్తి సోమయ్య (48)కు వారం కిందట జ్వరం రాగా స్థానిక ఆస్పత్రిలో చికిత్స అందించారు. తగ్గకపోవడంతో నర్సంపేటలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి వరంగల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమించి మంగళవారం తెల్లవారుజామున మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ విషయమై గుండాల వైద్యాధికారి మనీశ్‌రెడ్డిని వివరణ కోరగా మృతుడు ఆస్పత్రికి రాలేదని, ప్రైవేట్ ఆస్పత్రిలో చేసిన టెస్టులను పరిశీలించగా మల్టీ ఆర్గాన్స్ దెబ్బతినడం వల్ల చనిపోయినట్లు గుర్తించామన్నారు.

ఉపాధ్యాయ వృత్తి మహోన్నతమైనది

ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్



ఉపాధ్యాయులకు ప్రశంసాపత్రం అందిస్తున్న పీఓ

భద్రాచలం: విద్యార్థులను అన్ని రంగాల్లో తీర్చిదిద్ది వారి జీవితానికి సార్థకత తీసుకొచ్చే ఉపాధ్యాయ వృత్తి మహోన్నతమైనదని ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్ అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా మంగళవారం ఐటీడీఏ సమావేశం మందిరంలో సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. గురువు స్థానం తల్లిదండ్రుల కంటే ముఖ్యమైందన్నారు. ఎంతోమంది గిరిజన విద్యార్థులు ఉన్నత స్థానాల్లో నిలవడంలో ఉపాధ్యాయుల కృషి ఎనలేనిదని కొనియాడారు. గురువులు నిత్య విద్యార్థిలా మారి పిల్లలకు సరైన బోధన చేయాలన్నారు. అనంతరం గిరిజన సంక్షేమ శాఖలో పనిచేస్తున్న ఉపాధ్యాయులను, సిబ్బందిని సత్కరించి ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్, గిరిజన సంక్షేమశాఖ డీడీ మణెమ్మ, ఏసీఎంఓ రమణయ్య, ఏటీడీఓలు నరసింగరావు, రూపాదేవి, చంద్రమోహన్, అలివేలు మంగ తాయారు పాల్గొన్నారు.

ప్యాకేజీ అందించండి..

గ్రామసభలో ఆర్డీఓకు రైతుల విన్నపం



గ్రామసభలో మాట్లాడుతున్న ఆర్డీఓ మంగీలాల్

కరకగూడెం: పులుసుబొంత ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా భూములు కోల్పోతున్న నిర్వాసితులు.. తమకు ప్యాకేజీ వచ్చేలా చూడాలని విన్నవించారు. మంగళవారం భద్రాచలం సబ్‌డివిజన్ ఆర్డీఓ మంగీలాల్ అధ్యక్షతన మండలంలోని సమత్‌మోతే, మోతె, సమత్ భట్టుపల్లి, భట్టుపల్లి గ్రామాల్లో ప్రాజెక్టు భూసేకరణకు సంబంధించిన అభ్యంతరాల కోసం గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు భూములు కోల్పోతున్న రైతుల వివరాలను చదివి వినిపించారు. అనంతరం ఆర్డీఓ మాట్లాడుతూ.. పారదర్శకంగా నిర్వాసితుల వివరాలను నమోదు చేశామని, భూములు కోల్పోయి పేర్లు నమోదు కాకపోతే ఆందోళన చెందాల్సిన అవసరం లేకుండా తగిన ఆధారాలతో తహసీల్దార్‌కు వినతిపత్రం ఇవ్వాలన్నారు. ఆ తర్వాత సర్వే చేయించి పేర్లను తిరిగి నమోదు చేయిస్తామని వెల్లడించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ.. భూములు కోల్పోయినా తమ పేర్లు నమోదు కాలేదని ఆర్డీఓ దృష్టికి తీసుకురాగా వారి వివరాలను సేకరించి తక్షణమే సర్వే చేయాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ నరేశ్, డీటీ సంధ్య, జెడ్పీటీసీ కొమరం కాంతారావు, సర్పంచులు విజయ్‌కుమార్, ఊకే రామనాథం, ఆర్‌ఐలు షేక్ హుస్సేన్, రాజు, ఇరిగేషన్ వర్క్ ఇన్‌స్పెక్టర్ సింగరయ్య, రెవెన్యూ సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

గిరిజన చట్టాలకు రక్షణ కల్పించే వరకు ఉద్యమం



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎస్టీ సంఘాల నాయకులు

ఇల్లెందురూరల్: గిరిజన చట్టాలకు పాలకులు పూర్తిస్థాయిలో రక్షణ కల్పించే వరకు ఎస్టీ సంఘాలు ఐక్యంగా ఉద్యమిస్తాయని తుడుందెబ్బ జాతీయ కన్వీనర్ రమణాల లక్ష్మయ్య, రాష్ట్ర అధ్యక్షుడు వట్టం ఉపేందర్, ఎల్‌హెచ్‌పీఎస్ నేత రాజేశ్‌నాయక్ స్పష్టం చేశారు. ఇల్లెందు మండలం మిట్టపల్లిలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ఇల్లెందులోని ఐతా ఫంక్షన్ హాల్‌లో ఈ నెల 17న రాష్ట్రీయ ఆదివాసీ ఏక్తా పరిషత్ ఆధ్వర్యాన నిర్వహించే రాష్ట్రస్థాయి శిక్షణ శిబిరానికి ఎస్టీ సంఘాల ఐక్యవేదిక నాయకులు హాజరు కావాలని కోరారు. అనంతరం శిక్షణ తరగతుల ప్రచార పోస్టర్లు ఆవిష్కరించారు. సమావేశంలో నాయకులు వట్టం కన్నయ్య, పూనెం బాలకృష్ణ, పంతుల్యానాయక్, కేశవ్‌నాయక్, పూనెం శ్రీను, దుగ్గరపు వీరభద్రం, హతీరాంనాయక్, అశోక్, నాగేంద్ర, రవి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తులు హల్‌చల్

అశ్వారావుపేట: అశ్వారావుపేటలో సోమవారం రాత్రి సమయంలో ముగ్గురు గుర్తు తెలియని వ్యక్తులు హల్‌చల్ చేశారు. పట్టణంలోని కలింగుల బజార్‌లో అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో ధనబాబు ఇంటి ఆవరణంలో ముగ్గురు గుర్తుతెలియని వ్యక్తులు ప్రవేశించి తలుపులు, కిటికీలు కొడుతూ తలుపులు తీసేందుకు ప్రయత్నం చేశారు. శబ్దాలు రావడంతో గమనించిన కుటుంబ సభ్యులు తలుపులు తీయకుండా గట్టిగా కేకలు వేస్తూ, కర్రలు తీసుకొని ఇంట్లో నుంచి బయటకు వచ్చారు. కేకలు విని చుట్టుపక్కల వారు కూడా వచ్చే సరికి గుర్తు తెలియని వ్యక్తులు అక్కడి నుంచి పారిపోయారు. బాధితులు స్థానిక పోలీసులకు సమాచారం అందించడంతో పోలీసులు వచ్చి పరిసర ప్రాంతాల్లో గాలింపు చర్యలు చేపట్టారు. రాత్రి సమయాల్లో ఎవరైనా తలుపులు కొడితే ఒంటరిగా బయటకు రావొద్దని, వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. కాగా, ఇదే కాలనీలో ఆదివారం తెల్లవారుజామున ఇంట్లో నిద్రిస్తున్న ఓ మహిళ మెడలో నుంచి 32 గ్రాముల బంగారు గొలుసును దుండగులు చోరీ చేసిన విషయం విదితమే. ఒకే కాలనీలో ఇలా వరుస ఘటనలు జరుగుతున్నందున పోలీసులు రాత్రి సమయంలో గస్తీ నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు.

బాబు బంగ్లాకే ముడుపులు..

మళ్లీ ఆ ముగ్గురే

అమరావతి కాంట్రాక్టుల తరహాలోనే 'స్కిల్' స్కామ్.. సూత్రధారి చంద్రబాబే

- 'సీమెన్స్'కి తెలియకుండా ఆ కంపెనీతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు మాయ
- కాగితాలపై రూ.3,300 కోట్ల ప్రాజెక్టును చూపించి మోసం
- ప్రభుత్వ వాటా పేరుతో డిజైన్ టెక్ కంపెనీకి నిధుల మళ్లింపు
- నకిలీ ఇన్వాయిస్‌లతో డ్రా చేసి పార్థసానికి అందించిన యోగేశ్
- వాటిని హైదరాబాద్‌కు తరలించి చంద్రబాబు పీఎస్‌కు అందించిన పార్థసాని
- ఆ కొల్లగొట్టిన నిధులు చివరకు చేరింది చంద్రబాబు నివాసానికే!
- మనోజ్ పార్థసాని, యోగేశ్ గుప్తా, బాబు పీఎస్ పెండ్యాల శ్రీనివాస్‌లకు సిట్ నోటీసులు
- విచారణకు హాజరు కావాలని ముగ్గురికీ ఆదేశం
- 'స్కిల్' కుంభకోణం కేసు దర్యాప్తు వేగవంతం



సాక్షి, అమరావతి: తీగ లాగితే డొంకంతా కదులుతోంది! ముడుపుల చిట్టాలన్నీ చంద్రబాబు బంగ్లాకే దారితీస్తున్నాయి!! అమరావతిలో తాత్కాలిక నిర్మాణాలు, టిడ్కో ఇళ్ల కాంట్రాక్టుల్లో ప్రజాధనాన్ని లూటీ చేసిన వ్యవహారంలో ఆదాయపన్ను (ఐటీ) శాఖ తీగ లాగితే... చంద్రబాబు కనుసన్నల్లో సాగిన ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీ ఎస్ఎస్‌డీసీ) కుంభకోణం పునాది బయటపడుతోంది. కుంభకోణాలు వేర్వేరైనా కొల్లగొట్టిన ప్రజాధనాన్ని షెల్ కంపెనీల ద్వారా తరలించడంలో పాత్రధారులు మాత్రం వారే. ఆ అక్రమార్జన అంతా చివరకు చేరింది సూత్రధారి చంద్రబాబు చెంతకే అన్నది స్పష్టమవుతోంది. టీడీపీ హయాంలో భవన నిర్మాణ ప్రాజెక్టుల కాంట్రాక్టులను కట్టబెట్టడంలో అక్రమార్జనకు సంబంధించి చంద్రబాబుకు ఐటీ శాఖ నోటీసుల ప్రకంపనలు కొనసాగుతున్నాయి. ఆ కుంభకోణంలో పాత్రధారులుగా ఉన్న మనోజ్ వాసుదేవ్ పార్థసాని, చంద్రబాబు పీఎస్ పెండ్యాల శ్రీనివాస్, యోగేశ్ గుప్తా ఏపీఎస్ఎస్‌డీసీ అవినీతి బాగోతంలోనూ కీలకంగా వ్యవహరించారని వెల్లడైంది. ఇప్పటికే ఏపీఎస్ఎస్‌డీసీ కుంభకోణం కేసు దర్యాప్తులో కీలక ప్రగతి సాధించిన సీఐడీ ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) తాజా పరిణామాలతో తక్షణం రంగంలోకి దిగింది. ముడుపుల తరలింపులో సూత్రధారులుగా వ్యవహరించిన యోగేశ్ గుప్తా, మనోజ్ వాసుదేవ్ పార్థసాని, పెండ్యాల శ్రీనివాస్‌లను విచారించాలని నిర్ణయించింది. ఈమేరకు వారికి నోటీసులు జారీ చేసి దర్యాప్తును వేగవంతం చేసేందుకు సిద్ధమైంది.

బాబు అవినీతి 'స్కిల్'...

టీడీపీ హయాంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రధాన సూత్రధారిగా ఏపీఎస్ఎస్‌డీసీ కుంభకోణం జరిగినట్లు 'సిట్' ఇప్పటికే కీలక ఆధారాలు సేకరించింది. జర్మనీకి చెందిన సీమెన్స్ కంపెనీకి ఏమాత్రం తెలియకుండా ఆ కంపెనీ పేరుతో ఒప్పందం కుదుర్చుకున్నట్లుగా మోసగించి ప్రజాధనాన్ని కొల్లగొట్టినట్లు ఆధారాలతో సహా నిరూపించింది. రూ.3,300 కోట్ల ప్రాజెక్టును కాగితాలపై చూపించి సీమెన్స్ కంపెనీ 90 శాతం నిధులు సమకూరుస్తుందని బుకాయించి రాష్ట్ర ప్రభుత్వం 10 శాతం నిధులను కేటాయించేలా ఒప్పందం కుదుర్చుకున్నారు. సీమెన్స్ కంపెనీ ఒక్క రూపాయి కూడా ఇవ్వకుండానే ప్రభుత్వ వాటా 10 శాతం కింద జీఎస్టీతో కలిపి మొత్తం రూ.371 కోట్లను అడ్డగోలుగా చెల్లించేశారు. అలా నిధులు చెల్లించడం నిబంధనలకు విరుద్ధమని అప్పటి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఐవైఆర్ కృష్ణారావుతోపాటు మరో ముగ్గురు సీనియర్ ఐఏఎస్ అధికారులు వారించినా ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు ఖాతరు చేయలేదు. ఏకపక్షంగా రూ.371 కోట్లను సీమెన్స్ భాగస్వామ కంపెనీగా ఒప్పందంలో చూపించిన డిజైన్ టెక్ కంపెనీకి విడుదల చేశారు. అందులో రూ.241 కోట్లను పలు షెల్ కంపెనీలను సృష్టించి హవాలా మార్గంలో టీడీపీ ప్రభుత్వంలో ముఖ్యనేత కొల్లగొట్టారు. ఈ కేసులో సిట్ అధికారులు 8 మందిని అరెస్టు చేశారు. హవాలా మార్గంలో నల్లధనాన్ని చలామణిలోకి తెచ్చినందున కేంద్ర దర్యాప్తు సంస్థ ఈడీ కూడా రంగంలోకి దిగింది. మనీలాండరింగ్‌కు పాల్పడ్డారని నిర్ధారించి ఈ కేసులో నలుగురిని అరెస్టు చేయడంతోపాటు డిజైన్ టెక్ కంపెనీకి చెందిన రూ.31.20 కోట్లను అటాచ్ చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది.

షెల్ కంపెనీలు.. బోగస్ ఇన్వాయిస్‌లు

టీడీపీ ప్రభుత్వంలో అమరావతిలో తాత్కాలిక నిర్మాణాల కాంట్రాక్టులను కట్టబెట్టిన కుంభకోణంలో పాత్రధారులుగా ఉన్నవారే ఏపీఎస్ఎస్‌డీసీ కుంభకోణంలోనూ కీలకపాత్ర పోషించారని సిట్ గుర్తించింది. షాపూర్జీ– పల్లోంజీ కంపెనీ ప్రతినిధి మనోజ్ వాసుదేవ్ పార్థసాని, షెల్ కంపెనీల సృష్టికర్త యోగేశ్ గుప్తా, చంద్రబాబు పీఎస్ పెండ్యాల శ్రీనివాస్.. ఈ ముగ్గురూ అమరావతి భవన నిర్మాణాల కాంట్రాక్టు అవినీతి సొమ్మును చంద్రబాబుకు చేర్చడంతో కీలకంగా వ్యవహరించారన్నది ఇప్పటికే నిర్ధారణ అయ్యింది. రూ.8 వేల కోట్ల విలువైన నిర్మాణాల కాంట్రాక్టుల్లో భారీ అవినీతికి పాల్పడి ఆ నల్లధనాన్ని మనోజ్ వాసుదేవ్ పార్థసాని షెల్ కంపెనీల ద్వారా చంద్రబాబుకు చేర్చారు. అందుకోసం షెల్ కంపెనీలను సృష్టించడంలో యోగేశ్ గుప్తా కీలక పాత్ర పోషించారు. ఆయన నివాసంలో ఐటీ శాఖ అధికారులు సోదాలు కూడా నిర్వహించారు. మరోవైపు ఆ షెల్ కంపెనీల పేరుతో మళ్లించిన నిధులను డ్రా చేసి మనోజ్ వాసుదేవ్ పార్థసాని నగదు రూపంలో చంద్రబాబు పీఎస్ పెండ్యాల శ్రీనివాస్‌కు హైదరాబాద్‌లో అందించారు. ఆ విధంగా చంద్రబాబుకు చేరిన అక్రమార్జనలో రూ.118 కోట్లకు సంబంధించి లెక్కలు చెప్పాలని ఐటీ శాఖ నోటీసులు జారీ చేయడం జాతీయస్థాయిలో చర్చనీయాంశంగా మారింది.

బాబుకు ముడుపులు చేరాయిలా..

అమరావతిలో తాత్కాలిక నిర్మాణ కాంట్రాక్టుల అవినీతి దందాలో సూత్రధారులుగా వ్యవహరించిన యోగేశ్ గుప్తా, మనోజ్ పార్థసాని, పెండ్యాల శ్రీనివాస్ ఏపీఎస్ఎస్‌డీసీ కుంభకోణంలో ప్రధాన భూమిక పోషించిన తీరు ఇదీ..

- ఏపీఎస్ఎస్‌డీసీ నిధులను కొల్లగొట్టేందుకు యోగేశ్ గుప్తా పలు షెల్ కంపెనీలను సృష్టించాడు. ముంబై, పుణే కేంద్రాలుగా సృష్టించిన షెల్ కంపెనీల పేరిట నకిలీ ఇన్వాయిస్‌లను సమర్పించారు. ఆ ఇన్వాయిస్‌ల ఆధారంగా షెల్ కంపెనీలకు ఏపీఎస్ఎస్‌డీసీ రూ.371 కోట్లను విడుదల చేసింది. దీనిపై ఆధారాలు సేకరించిన అనంతరం సిట్ అధికారులు ఏపీఎస్ఎస్‌డీసీ కుంభకోణంలో కేసులో యోగేశ్ గుప్తాను ఏ–22గా పేర్కొంటూ కేసు నమోదు చేశారు. ప్రస్తుతం బెయిల్‌పై ఉన్నాడు.
- నకిలీ ఇన్వాయిస్‌ల ఆధారంగా షెల్ కంపెనీలకు చేరిన రూ.371 కోట్లను యోగేశ్ గుప్తా డ్రా చేసి మనోజ్ పార్థసానికి అందించాడు. ఆయన అందులో రూ.241 కోట్లను ముంబై నుంచి హైదరాబాద్‌కు తరలించాడు. రూ.241 కోట్ల నగదు మొత్తాన్ని హైదరాబాద్‌లో ఉన్న చంద్రబాబు పీఎస్ పెండ్యాల శ్రీనివాస్‌కు అందించాడు.
- ఆ రూ.241 కోట్ల నగదు మొత్తం పెండ్యాల శ్రీనివాస్ ద్వారా చివరకు హైదరాబాద్‌లో చంద్రబాబు నివాసానికి చేరినట్లు స్పష్టమవుతోంది.

ఆ ముగ్గురికీ సిట్ నోటీసులు

ఏపీఎస్ఎస్‌డీసీ నిధులను కొల్లగొట్టడంతో పాత్రధారులుగా వ్యవహరించిన యోగేశ్ గుప్తా, మనోజ్ పార్థసాని, పెండ్యాల శ్రీనివాస్‌లకు సిట్ అధికారులు తాజాగా నోటీసులు జారీ చేశారు. వచ్చే సోమవారం విజయవాడలో సిట్ అధికారుల ఎదుట విచారణకు హాజరు కావాలని యోగేశ్ గుప్తా, మనోజ్ పార్థసానికి నోటీసులిచ్చారు. చంద్రబాబు పీఎస్ పెండ్యాల శ్రీనివాస్ ఈనెల 14న విచారణకు హాజరు కావాలని అందులో పేర్కొన్నారు.

'గోవింద కోటి' రాసిన వారికి బ్రేక్ దర్శనం



బోర్డు సభ్యులతో చైర్మన్ భూమన

- విద్యార్థులకు కోటి భగవద్గీత పుస్తకాల పంపిణీ
- సనాతన ధర్మం అనేది మతం కాదు.. అదొక జీవనయానం
- టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి

తిరుమల: యువతలో హైందవ సనాతన ధర్మ వ్యాప్తి కోసం శ్రీవారి ఆలయం నుంచే తొలి అడుగు వేస్తున్నామని, ఇందులో భాగంగా రామకోటి తరహాలో గోవింద కోటి రాసిన 25 ఏళ్ల లోపు వారికి వారి కుటుంబ సభ్యులతో కలిసి ఒకసారి తిరుమల స్వామివారి బ్రేక్ దర్శనం కల్పిస్తామని టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి చెప్పారు. 10 లక్షల 1,116 సార్లు గోవింద నామం రాసిన వారికి దర్శన సౌభాగ్యం కల్పిస్తామన్నారు. తిరుమల అన్నమయ్య భవనంలో మంగళవారం ధర్మకర్తల మండలి తొలి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా తీసుకున్న నిర్ణయాలను చైర్మన్ మీడియాకు వివరించారు. విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా 20 పేజీల్లో భగవద్గీత సారాంశాన్ని పుస్తక ప్రసాదంగా కోటి పుస్తకాలు ముద్రించి పంపిణీ చేస్తామని చెప్పారు. ఇటీవల చిరుత దాడిలో మృతి చెందిన చిన్నారి లక్షిత కుటుంబానికి టీటీడీ ద్వారా గతంలో ప్రకటించిన రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియాను రూ.10 లక్షలకు పెంచినట్లు చెప్పారు. ముంబైలోని బాంద్రాలో రూ.1.65 కోట్లతో శ్రీవారి రెండో ఆలయం, రూ.5.35 కోట్లతో సమాచార కేంద్రాన్ని నిర్మించనున్నట్లు చెప్పారు. ఈ మొత్తాన్ని టీటీడీ బోర్డు సభ్యులు విరాళంగా అందిస్తారన్నారు. రూ.33 కోట్లతో వడమాలపేట మండలం పాదిరేడు అరణ్యం వద్ద టీటీడీ ఉద్యోగుల ఇళ్లస్థలాల కోసం కేటాయించిన స్థలంలో రోడ్లు, ఇతర మౌలిక వసతులు కల్పిస్తామని, ఈ మొత్తాన్ని ఉద్యోగులు తిరిగి టీటీడీకి చెల్లిస్తారన్నారు. రూ.600 కోట్లతో తిరుపతి రైల్వేస్టేషన్ వెనుక వైపు ఉన్న 2,3 సత్రాల స్థానంలో అచ్యుతం, శ్రీపథం వసతి సముదాయాలను నిర్మించనున్నట్లు తెలిపారు. టీటీడీ ఆలయాల్లో 413 పోస్టుల మంజూరు కోసం ప్రభుత్వానికి విన్నవించనున్నట్లు చెప్పారు. తిరుపతిలో నిర్మాణం కానున్న శ్రీ పద్మావతి చిన్నపిల్లల సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో 300 మందిని నియమించనున్నట్లు చెప్పారు. టీటీడీ ఆధ్వర్యంలోని ధర్మగిరి, కీసరగుట్ట, విజయనగరం, ఐ.భీమవరం, కోటప్పకొండ, తెలంగాణలోని నల్లగొండ వేద విజ్ఞాన పీఠాలకు సంబంధించి అదనంగా 47 అధ్యాపక పోస్టులను మంజూరు చేసినట్లు చెప్పారు.

ఉదయనిధి మాటలను ఖండిస్తున్నాం

సనాతన ధర్మంపై తమిళనాడు మంత్రి ఉదయనిధి స్టాలిన్ చేసిన విమర్శలను భూమన ఖండించారు. సనాతన ధర్మం మతం కాదని, అదొక జీవన యానమని చెప్పారు. ఈ విషయం తెలియక సనాతన ధర్మానికి కులాలను ఆపాదించి విమర్శలు చేస్తే సమాజంలో అలజడి చెలరేగే అవకాశం ఉంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇది విమర్శకులకు కూడా మంచిది కాదన్నారు.

బీసీ బిల్లు, మహిళా బిల్లు ప్రవేశపెట్టాలి

- ఈనెల 21న చలో ఢిల్లీకి పిలుపునిచ్చిన ఆర్.కృష్ణయ్య



సాక్షి, న్యూఢిల్లీ: పార్లమెంటు ప్రత్యేక సమావేశాల్లో బీసీ బిల్లు, మహిళా బిల్లు ప్రవేశపెట్టాలని వైఎస్సార్‌సీపీ ఎంపీ, జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవం సందర్భంగా దేశంలో జరిగిన అభివృద్ధి గురించి పార్లమెంట్ ప్రత్యేక సమావేశంలో చర్చించనున్నట్లు కేంద్రమంత్రులు ప్రకటించారన్నారు. అయితే 76 సంవత్సరాల స్వాతంత్ర్యం తర్వాత ఈ దేశంలోని 56 శాతం జనాభా గల బీసీ కులాల బతుకులు ఎలా బాగుపడ్డాయో, బాగుపడటానికి ఎలాంటి చర్యలు తీసుకున్నారో కూడా పార్లమెంట్‌లో చర్చ జరగాలని కృష్ణయ్య కోరారు. ఈ మేరకు ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ పార్లమెంటు ప్రత్యేక సమావేశాల్లో బీసీ బిల్లు, మహిళా బిల్లులో మహిళలకు సబ్ కోటా కల్పించాలని, కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలన్న డిమాండ్‌తో ఈనెల 21న చలో ఢిల్లీకి పిలుపునిచ్చారు. మహిళా బిల్లులో బీసీ మహిళలకు ప్రాతినిధ్యం కల్పించకపోతే మహిళా బిల్లుకు సార్థకత లేదని కృష్ణయ్య తెలిపారు. మహిళా బిల్లు గురించి గొంతులు చించుకుని మాట్లాడే రాజకీయ పార్టీల నాయకులు బీసీ మహిళల గురించి, వారికి జరుగుతున్న అన్యాయాలు, అత్యాచారాల గురించి ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు.

జిల్లా వార్తలు

ఆదివాసీ జాతీయ మహాసభల ప్రతినిధిగా వీరభద్రం



భూక్యా వీరభద్రం

వైరా: ఆదివాసీ అధికరాష్ట్రీయ మంచ్ ఆధ్వర్యాన జరగనున్న నాలుగో జాతీయ మహాసభలకు తెలంగాణ ప్రతినిధిగా గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్యా వీరభద్రం ఎంపికయ్యారు. తమిళనాడు రాష్ట్రంలోని సమక్కల్ జిల్లా కేంద్రంలో ఈ నెల 18 నుంచి 21వ తేదీ వరకు మహాసభలు జరగనున్నాయి. ఈ మేరకు వీరభద్రాన్ని జాతీయ మహాసభల ప్రతినిధిగా ఎంపిక చేశారు. ఖమ్మం జిల్లా ఐటీడీఏ సాధన కమిటీ చైర్మన్‌గా కొనసాగుతున్న ఆయన మాట్లాడుతూ.. గిరిజన తెగల ఐక్యత, రాజ్యాంగం కల్పించిన హక్కుల పరిరక్షణకు చేపట్టాల్సిన పోరాటాలపై సభల్లో చర్చిస్తానని తెలిపారు.

బొగ్గు గనుల్లో రక్షణ చర్యల్లో నిర్లక్ష్యం

సింగరేణి(కొత్తగూడెం): బొగ్గుగనుల్లో రక్షణ విషయమై యాజమాన్యాలు, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అఖిల భారతీయ ఖదాన్ మజ్దూర్ సంఘ్ బొగ్గు పరిశ్రమల ఇన్‌చార్జ్ కొత్తకాపు లక్ష్మారెడ్డి ఆరోపించారు. నాగ్‌పూర్‌లో రెండు రోజులుగా జరుగుతున్న సమావేశాల్లో ఆయన మంగళవారం మాట్లాడారు. బొగ్గుగనుల్లో రక్షణపై యాజమాన్యాల నిర్లక్ష్యంతో అమాయకులైన కార్మికుల కుటుంబాలు వీధిన పడుతున్నాయని తెలిపారు. ఇకనైనా ప్రమాదాల నివారణపై దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. అలాగే, కాంట్రాక్ట్ కార్మికులకు సెలవులు, ఆరోగ్య, ఉద్యోగ భద్రతకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ విషయమై 6వ తేదీన అన్ని ఏరియాల జీఎం కార్యాలయాల ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో నాగ్‌పూర్ ఎమ్మెల్యే టి.లోకేశ్వర్‌రాథోడ్, నాయకులు సుధీర్‌గురుడే, పి.మాధవ్‌నాయక్, పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

11 నుంచి సింగరేణిలో బయోమెట్రిక్

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి వ్యాప్తంగా హాజరు నమోదు కోసం ఈ నెల 11వ తేదీ నుంచి బయోమెట్రిక్ విధానాన్ని అమలు చేయనున్నారు. ఈ విషయమై యాజమాన్యం మంగళవారం అన్ని ఏరియాలకు ఆదేశాలు జారీ చేసింది. గతంలోనూ ఈ విషయమై ప్రకటన చేసినా ఇప్పుడు అమలుకు సిద్ధమయ్యారు. బయోమెట్రిక్ విధానంలో హాజరు నమోదు కోసం ఏర్పాట్లు చేయాలని ఏరియాల అధికారులను యాజమాన్యం ఆదేశించింది.

గురుకుల ఉపాధ్యాయులకు తీపి కబురు

- సర్వీసు క్రమబద్ధీకరిస్తూ ప్రభుత్వ నిర్ణయం
- ఖమ్మం రీజియన్‌లో 96 మందికి లబ్ధి



ఖమ్మంమయూరిసెంటర్: ఎస్సీ గురుకులాల్లో కాంట్రాక్ట్ పద్ధతిపై విధులు నిర్వర్తిస్తున్న ఉపాధ్యాయులను రెగ్యులర్ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీ కాగా.. ఈ నిర్ణయంతో ఖమ్మం రీజియన్‌లో 96 మందికి మేలు జరగనుంది. ఖమ్మం రీజియన్‌లోని ఖమ్మం జిల్లా గురుకుల పాఠశాలల్లో 53 మంది, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ఎనిమిది గురుకుల పాఠశాలల్లో 25 మంది, మహబూబాబాద్ జిల్లాలోని ఐదు గురుకులాల్లో 18 మంది ఉపాధ్యాయులు ఇక నుంచి రెగ్యులర్ కానున్నారు. వీరందరూ గత పదహారేళ్లుగా కాంట్రాక్టర్ పద్ధతిలో విధులు నిర్వర్తిస్తున్నారు. కాగా, వీరికి 12 నెలల వేతనం, బేసిక్ పేతో పాటు ఆరు నెలల ప్రసూతి సెలవులు వర్తించనున్నాయి. ప్రభుత్వ నిర్ణయంతో ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఉపాధ్యాయుల క్రమబద్ధీకరణపై మంత్రి పువ్వాడ హర్షం

ఉపాధ్యాయ దినోత్సవ కానుకగా కాంట్రాక్టు ఉపాధ్యాయుల సర్వీస్‌ను క్రమబద్ధీకరిస్తూ సీఎం కేసీఆర్ తీసుకున్న నిర్ణయంపై రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ హర్షం వ్యక్తం చేశారు. సాంఘిక సంక్షేమ శాఖ గురుకులాల్లో పని చేస్తున్న కాంట్రాక్టు ఉపాధ్యాయులకు 12 నెలల జీతం, బేసిక్ పేతో పాటు ఆరు నెలల ప్రసూతి సెలవులను ప్రభుత్వం ప్రకటించడం చారిత్రక నిర్ణయమని పేర్కొన్నారు.

డీసీసీబీలో యూపీఐ సేవలు



యూపీఐ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న చైర్మన్ నాగభూషణం, అధికారులు, డైరెక్టర్లు

డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం

ఖమ్మంవ్యవసాయం: జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ (డీసీసీబీ) ఖాతాదారుల సౌకర్యార్థం యూపీఐ (యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్) సేవలను అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఖమ్మంలోని బ్యాంకు ప్రధాన కార్యాలయంలో ఈ వివరాలను బ్యాంకు చైర్మన్ కూరాకుల నాగభూషణం వెల్లడించారు. వాణిజ్య బ్యాంకులకు దీటుగా డీసీసీబీ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు నిరంతరం శ్రమిస్తున్నామని తెలిపారు. ఇందులో భాగంగానే ప్రవేశపెట్టిన యూపీఐ సేవలను ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బ్యాంకు సీఈఓ అట్లూరి వీరబాబు మాట్లాడుతూ గత ఏడాది డిసెంబర్‌లో మొబైల్ బ్యాంకింగ్ సేవలను, ఇప్పుడు యూపీఐ సేవలను ప్రారంభించామని పేర్కొన్నారు. ఈ సౌకర్యం పొందేందుకు ఖాతాదారులు సంబంధిత బ్రాంచ్ మేనేజర్లను సంప్రదించి సీబీఎస్‌లో వివరాలను రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో బ్యాంకు పాలకవర్గ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

17న మోటార్ మెకానిక్ ట్రైయినీ రాతపరీక్ష

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థ 2017లో విడుదల చేసిన ఎక్స్‌టర్నల్ నోటిఫికేషన్ ద్వారా ప్రకటించిన మోటార్ మెకానిక్ ట్రైయినీ (కేటగిరీ–1) అభ్యర్థులకు ఈ నెల 17న రాతపరీక్ష నిర్వహించనున్నారు. కొత్తగూడెంలోని సింగరేణి మహిళా డిగ్రీ కళాశాలలో పరీక్ష ఉంటుందని రిక్రూట్‌మెంట్ సెల్ జీఎం కట్టా బసవయ్య తెలిపారు. పరీక్ష మధ్యాహ్నం 2 నుంచి 3.30 గంటల వరకు జరుగుతుందని, అభ్యర్థులు సింగరేణి వెబ్‌సైట్ నుంచి హాల్‌టికెట్ డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. కాగా, అభ్యర్థులు హాల్‌టికెట్, ఆధార్ కార్డ్‌తో పాటు ఓటర్ గుర్తింపు కార్డు లేదా డ్రైవింగ్ లైసెన్స్ తదితర ప్రభుత్వం జారీ చేసిన ఏదైనా గుర్తింపు కార్డు వెంట తీసుకురావాలని, ఉద్యోగాలు ఇప్పిస్తామనే దళారుల మాటలు నమ్మొద్దని తెలిపారు.

ఐదో రోజుకు చేరిన 'అగ్నివీర్'



1,600 మీటర్ల పరుగు పందెంలో పాల్గొన్న అభ్యర్థులు

ఖమ్మంస్పోర్ట్స్: సైన్యంలో నియామకాలకు సంబంధించి ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో నిర్వహిస్తున్న అగ్నివీర్ ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ మంగళవారం ఐదో రోజుకు చేరింది. ఈ సందర్భంగా 1,207 మందికి అడ్మిట్ కార్డులు జారీ చేయగా 900 మంది హాజరయ్యారు. అన్ని పరీక్షలు పూర్తయ్యాక వీరిలో 432 మంది మెడికల్ టెస్ట్‌కు అర్హత సాధించారు. రోజులాగే అభ్యర్థులు సోమవారం రాత్రికే ఖమ్మం చేరుకుని పోటీల్లో పాల్గొన్నారు.

అర్హత సాధిస్తున్నది తక్కువ మందే..

ఆన్‌లైన్ పరీక్ష రాసిన అభ్యర్థుల్లో అర్హత సాధించిన వారిని ఈవెంట్లకు ఎంపిక చేశారు. ఇందుకోసం వీరు వివిధ సెంటర్లలో శిక్షణ తీసుకున్నారు. కొందరు అభ్యర్థులు నేరుగా పోటీలకు హాజరవుతుండగా, మరికొందరు బృందంగా కోచింగ్ సెంటర్ల నిర్వాహకులతో వస్తున్నారు. కాగా, హాజరు శాతమే తక్కువగా ఉంటుండగా వీరిలోనూ పలువురు ఈవెంట్లు దాటడం లేదు. అయితే, పలువురు నిరుపేద అభ్యర్థులు శిక్షణకు స్తోమత లేక ఉద్యోగం వచ్చాక డబ్బు చెల్లిస్తామని సర్టిఫికెట్లను కోచింగ్ సెంటర్ల నిర్వాహకులకు అప్పగించినట్లు తెలుస్తోంది. తీరా ఈవెంట్లలో ఉత్తీర్ణత సాధించకపోవడంతో తమ పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని వాపోతున్నారు.

ఆర్టీసీ లక్కీ డ్రా విజేతల ఎంపిక



విజేతలను ఫోన్‌లో అభినందిస్తున్న ఆర్‌ఎం వెంకన్న

ఖమ్మంమామిళ్లగూడెం: రాఖీ పండుగ సందర్భంగా మహిళా ప్రయాణికుల కోసం ఆర్టీసీ ప్రవేశపెట్టిన లక్కీ డ్రాలో విజేతలను మంగళవారం ఎంపిక చేశారు. ఖమ్మం రీజియన్‌లోని ఆరు ఆర్టీసీ డిపోల బస్సుల్లో గత నెల 30, 31వ తేదీల్లో ప్రయాణించిన మహిళా ప్రయాణికులు తమ టికెట్లను బాక్సుల్లో వేశారు. వారి నుంచి విజేతల ఎంపిక కోసం ఖమ్మం కొత్త బస్టాండ్‌లో మంగళవారం డ్రా తీశారు. జిల్లా సంక్షేమ అధికారి టి.సుమ డ్రా తీయగా.. సత్తుపల్లికి చెందిన రుక్మిణి, కల్లూరుకు చెందిన జి.భారతి, పెనుబల్లి మండలం తుమ్మలపల్లికి చెందిన లక్ష్మి మూడు స్థానాల్లో నిలిచారు. వారికి ఆర్‌ఎం సీహెచ్.వెంకన్న ఫోన్ చేసి అభినందనలు తెలిపారు. కాగా, విజేతలకు ఈనెల 8న ఎంజీబీఎస్‌లో జరిగే సమావేశంలో రూ.25 వేలు, రూ.15 వేలు, రూ.10 వేల నగదు బహుమతులు అందజేయనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో డీఆర్‌ఎం జీఎస్ పవిత్ర, ఖమ్మం డీఎం శ్రీనివాస్, సీఐలు శ్రీనివాస్, రామయ్య, ఉద్యోగులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులు

జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా రాష్ట్రప్రభుత్వం పలువురు ఉపాధ్యాయులను ఎంపిక చేసింది. ఈసందర్భంగా ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి ముగ్గురు ఉపాధ్యాయులు, నలుగురు అధ్యాపకులు ఎంపికయ్యారు. హైదరాబాద్‌లో మంగళవారం జరిగిన సమావేశంలో వీరికి రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, హోం మంత్రి మహమూద్ అలీ అవార్డులు అందజేసి సన్మానించారు.
– సాక్షి నెట్‌వర్క్



ఆవుల రాంబాబు, రాపల్లి యూపీఎస్, బోనకల్



వెంపటి ఉషారాణి, ఎస్‌జీకే పాఠశాల, భద్రాచలం



డి.సురేష్‌బాబు, ఎస్ఆర్‌అండ్‌బీజీఎన్ఆర్ కళాశాల, ఖమ్మం



టి.అరుణకుమారి, లక్ష్మీదేవిపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పాల్వంచ



ఏ.ఆర్.సత్యవతి, ఎస్ఆర్‌అండ్‌బీజీఎన్ఆర్ కళాశాల, ఖమ్మం



ఎం.పూర్ణచందర్‌రావు, లక్ష్మీదేవిపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పాల్వంచ



గుంటి రమాదేవి, కూలీలైన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కొత్తగూడెం